# నాకింక ఎస్.బి. చాలు

భార్గవ రామారావు ఒక మంచి పేరున్న పోలీసు ఆఫీసరు. ఒక మామూలు కుటుంబానికి చెందిన అతను బి.ఏ. చదువుతుండగా, పోలీసు రిక్రూట్‌మెంటుకు పోవడం అక్కడ ఎలాంటి రకమెండేషన్ లేకుండా ఉద్యోగంలో చేరిపోవడం జరిగింది. ఆరడుగుల నాలుగంగులాల ఎత్తు , పరుగెత్తడంలోను, దూకడంలోను సమర్థుడు అనే కాకుండా ఫుట్ బాల్ కూడా బాగా ఆడేవాడు. మంచి మార్కులతో మెట్రిక్‌లేషన్, తదుపరి ఇంటర్మీడియట్ గూడా పాసయ్యాడు. అందుకే రాజకుమారి సంయుక్త వరమాల, బయట మెట్ల దగ్గరున్న పృథ్వీరాజు ప్రతిమ మెడలో పడినట్టు, పోలీసు డిపార్టుమెంటులో బంధుమిత్రులెవరూ లేని భార్గవ రామారావు యొక్క అర్హతనుబట్టే అతనికి ఉద్యోగ నియామకం వచ్చింది. పోలీసు శిక్షణా సమయంలో, తర్వాత పోలీసు స్టేషన్లో పనిచేసేటప్పుడు, మంచి సమర్థుడనే పేరు ఆయన సంపాదించాడు. ఎలాంటి పని ఇచ్చినా కూడా, చాలా చురుగ్గా ఆ పనిని చేసి పెట్టేవాడు. ముందు రోజుల్లో, ప్రజలతో చాలా మర్యాదగా మాట్లాడే, ప్రవర్తించే రామారావును ఒకసారి అతని సబ్ ఇన్‌స్పెక్టర్ తిట్టడం జరిగింది. తిట్టడమంటే ''యూ బ్లడీఫూల్'' అనే రీతిలో కాదు; కొద్దిగా ఉపదేశ రూపేణా... ''నువ్వు ఇలా మహాత్మాగాంధీలాగా ప్రవర్తిస్తే నిన్నెవర యినా లెక్కజేస్తారా? నీవు ఇంత ఎత్తుగా, లావుగా వున్నావుగాని, దాన్ని సరిగ్గా వాడుకోవడం నీకు తెలియదు. పోలీసు వాళ్లను మామూలుగా యమకింకరులని ఎందుకు అంటారు తెలుసా? నువు యమకింకరుడి లాగ కాదు వట్టి సుమకింకరడిలాగా వున్నావు. చూడు. నిన్నెవరైనా చూస్తే వాళ్లు వణికిపోవాలి. చిన్న పిల్లలయితే ఉచ్చపోసుకోవాలి. నీవు ఇలాగ మర్యాద రాముడి వేషం వేస్తే, ఈ ఖాకీ విలువే దిగిపోతుంది. నువు నోరు తెరిస్తేనే చుట్టూ వున్నా జనం పారిపోవాలి. పది బూతులు తిట్టడం నువు నేర్చుకోవాలి. నీ చేతిలో లాఠీ వుంది కదా, అది ఎందుకు? నీ బూతులు విని పారిపోని మనుష్యుల్ని, ఈ లాఠీ చూపించి భయపెట్టాలి. ఊరికే లాఠీని నేలకు కొట్టినా చాలు, అప్పుడప్పుడు వీపుపై రెండివ్వడం కూడా మంచిదే. ఎమ్.ఎస్.పి వస్తుందని వినగానే ప్రజలెందుకు వణికిపోతారు? అదే మాదిరి మనం సమర్థలమయితే, విషయాలు చూసుకోవడానికి లోకల్ పోలీసే చాలు. నీమంచి కొఱకే నేను ఇవన్నీ చెప్పేది. లా అండ్ ఆర్డర్‌లో మంచిపేరు సంపాదిస్తేనే ఒక మంచి పోలీసుగా నీకుపేరువచ్చేది.''

ఆ హితోపదేశం శ్రద్ధగా విని భార్గవ రామారావు ఆరోజు నుంచి ఒక మంచి లా అండ్ ఆర్డర్ పోలీసుగా తయారు కావడానికి మనస్ఫూర్తిగా శ్రమించాడు. చాలా తక్కువ కాలంలో అలాంటి పేరు గూడా సంపాదించాడు. మంచి విద్యావంతుడైన వ్యక్తి కావడంవల్ల, అతనికి ఇంగ్లీషు, హిందీ తెలుగులలో బూతులు తిట్టడం ఒక

కష్టమయిన పనికాదు. దీనికే పోలీసులు ''త్రీ ల్యాంగ్వేజ్ ఫార్ములా'' అని చెప్పేది. కొట్టడంలో, గుద్దడంలో అతని ఆరడుగులు నాలుగంగుళాల ఎత్తు, అతనికి ప్రసాదించే ప్రత్యేకమయిన విలువ ఎవరికీ తెలియదు. అయిదున్నర అడుగుల వాళ్లంతా అసూయతో అతనిని ఒకే భీమకాయుడి లాగా వీక్షించేవాళ్లు. నేరం ఒప్పుకోని గజదొంగలనే, దారికి తీసుకరావడానికి ఐదున్నర అడుగుల వారు యాభైన్నర ప్రహారాలు ఇచ్చిన తర్వాతగూడా నిష్ఫలంగా వుండేటప్పుడు, భార్గవ రామారావు శరీరాకారము చూడగానే, వాళ్లు చేయని నేరం కూడా ఒప్పుకొనేవారు. గుంపును చెదరగొట్టాల్సిన చోటుల్లో ఒక పోలీసు గుల్మం చేసే పనిని ఇతను చేసేవాడు. అతనొక సారి నోరు తెరిస్తే ఒక అల్సేషన్ స్వభావం కూడా అతనిలో కనిపించేది.

అందువల్ల చాలా తక్కువ వ్యవధిలోనే అతనికి హెడ్ కానిస్టేబుల్ ప్రమోషన్ వచ్చింది. తరువాత సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోషన్ గూడా అలాగే వచ్చింది. దానికి ముందుగానే అవుట్ ఆఫ్ సీనియారిటీ ఎన్.ఐ.గా కూడా పనిచేశాడు. సబ్ ఇన్‌స్పెక్టర్‌గా అతను గొప్ప పేరు సంపాదించాడు. ఏ స్టేషన్‌లో పనిచేసినా, అతను అందరికీ టెర్రర్‌గా వుండేవాడు.

పై అధికారుల కందరికీ అతనంటే చాలా అభిమానం. దానివల్ల నలభై ఐదవ సంవత్సరంలోనే అతను ఇన్‌స్పెక్టర్ కాగలిగాడు. ఇన్‌స్పెక్టర్‌గా కూడా, అతనికి లా అండ్ ఆర్డర్‌లోనే పోస్టింగ్ వచ్చింది. మామూలుగా ప్రజలతో మంచిగా ప్రవర్తించే అతనిలో, ఇన్‌స్పెక్టర్ అయిన తర్వాత కొన్ని మార్పులు వచ్చాయి. ఒరిజినల్ భార్గవ రాముడికి వున్నట్టు కాకపోయినా, ఇతనికి కూడా కొంచెం శీఘ్ర కోపం రావడం మొదలయింది. ఆ గొడ్డలి రాముడు చేసిన పనులలో వెయ్యోవంతు కూడా లేకపోయినా ఈ భార్గవరాముడు కూడా అప్పుడప్పుడు కొంచెం అలాగే ప్రవర్తించేవాడు. అలాంటి ఒక సందర్భంలో, అతని శీఘ్ర కోపానికి పాత్రమయిన మనిషి ఒక ఎమ్.ఎల్.ఏ గారి సొంత భార్యకు, సొంత తమ్ముడు కావడంవల్ల, ఇతనికి సస్పెన్షన్ వచ్చింది. తన ఉజ్జ్వలమైన సేవా శృంఖలంలో ఒక ( రింగు ) వలయం విరిగిపోయినట్టు అతనికి మహా బాధ కలిగింది. ఇంతకాలంగా తన సంపాదించిన మంచి పేరుకు కళంకం ఏర్పడడం వల్ల దుఃఖం కన్నా అతనికి రోషమే వచ్చింది. అతని సస్పెన్షన్ మీద పై అధికారులకు సానుభూతి వుండేది. అయినా గూడా ఓరల్ ఎంక్వైరీ జరిగి, వట్టి ఒక 'సెన్షర్'తో అతనిని డ్యూటీకి తిరిగి తీసుకొనేసరికి ఆరు నెలలు దాటింది. అంతకాలం యూనిఫాం నుంచి దూరంగా ఉండడంవల్ల అతనికి ఎంతో సిగ్గుగా అనిపించింది. మొత్తం ప్రపంచంమీదే అతనికి ఒక రకమైన ద్వేషం ఏర్పడింది. అతనికి ఇంక లా అండ్ ఆర్డర్ విభాగములో నియామకం ఇవ్వకూడదని ఒక ప్రభుత్వ ఉత్తర్వు వున్నట్టు తెలిసి, భార్గవ రామారావుకు ఎవర్నెవర్నో పీక పిసికి చంపుదామనిపించింది.

అంత సమర్ధుడయిన ఒక ఇన్‌స్పెక్టరును లా అండ్ ఆర్డర్‌లో పెట్టడానికి వీలు లేకపోయినప్పుడు ఇంక వేరే మంచి విభాగం ఏముంది?

ఎట్టకేలకు ఇన్‌స్పెక్టర్ భార్గవ రామారావు ట్రాఫిక్ విభాగంలో చేరాడు. కొద్ది రోజుల్లోనే ఆ విభాగంలోగూడా అతనికి మంచి పేరు వచ్చింది. కానీ అతని చేతిలో చిక్కిన ఒక్కరిని కూడా అతను వదలడు... చిన్న ట్రాఫిక్ నేరానికి కూడా వార్నింగ్ ఇచ్చి పంపించే అలవాటు అతనికి లేనే లేదు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భార్గవ రామారావు దాదాపు అందరికి ఒక సింహస్వప్నంలా తయారయినాడు. ఎవరికీ అతని కళ్లు తప్పించి వెళ్లడానికి అవకాశముండేది కాదు. అతను ఒకసారి ఆపాడంటే అది కారు కానీయండి, వట్టి సైకిలు కానీయండి, జుల్మానా పడటం ఖాయం. మారుతీ 1000 కానియండి, మర్సిడస్ బెంజ్ కానీయండి పట్టుకోవడానికి అతని కెలాంటి భయముండేది కాదు. దాని సారథి మంత్రిగారి పేరు, పై ఆఫీసరు పేరు చెప్పినా ఏం లాభం లేదు. కాని, ఒక విషయం అతను ఎవ్వరిని కూడా తిట్టడు, కొట్టడు. లా అండ్ ఆర్డర్ నుంచి సస్పెండ్ అయిన తరువాత తిరిగి డ్యూటీలో చేరేటప్పుడు, అలాంటి ఒక ఉత్తమమైన నిర్ణయం అతను తీసుకున్నాడు.

ఒక మంగళవారం సాయంత్రం, బేగంపేట ఏర్‌పోర్టు రన్‌వేకు తూర్పుగా వున్న, బాంబే వెళ్లే హైవేలో, కొంచెం పెద్దస్థాయిలో, మోటార్ వెహికల్స్ చెకింగ్ జరుగుతూ ఉంది. అంటే ఒక పద్దెరకం క్షవరమన్నమాట. మంచి వెడల్పుగా ఉన్న ఆ రోడ్డు కిరువైపులా వివిధ రకాల వాహనాలు వాటిదగ్గర ఒకే రకపు మనో వైషమ్యం ఉన్న మనుషులు వాళ్లలో చాలామంది ట్రాఫిక్ కానిస్టేబుళ్ల చుట్టూ, హెడ్ కానిస్టేబుళ్ల చుట్టూ, సబ్ ఇన్‌స్పెక్టర్ల చుట్టూ, కొద్దిమంది మాత్రం ఆ యముడులాంటి ఇన్‌స్పెక్టర్ చుట్టూ తిరుగుతునే వున్నారు. అందరి ముఖాలలో భయం, భీతి, పరిభ్రమణం మొదలైన భావాలు కదలాడుతూ వున్నాయి. గంటల వఱకు కాచుకొని, పోలీసు వాళ్లతో దయనీయంగా యాచించేవాళ్లు కానీయండి, కొంచెం దర్జాగా వాదోపవాదాలు జరిపేవాళ్లు కానీయండి, నవ్వు రాకుండా నవ్వేవాళ్లు కానీయండి, కన్నీరు రాకుండా ఏడ్చేవాళ్లు కానీయండి, అందరూ చివర్లో, భారీ జుల్మానా కట్టి, లేక, ఛలానా తీసుకొని లోకంలో వుండే సమస్త పోలీసు సిబ్బందిని తిట్టుకుంటూ వెళ్లిపోతున్నారు.

సమయం దాదాపు ఆరు ముప్పావు లేక ఏడు కావచ్చు. ఇంకా చీకటి కాలేదు. ఈ పోలీసు చెకింగ్ అటే జరుగుతున్న విషయం అసలే తెలియనట్టే ఒక మోపెడు వాడు బాణం లాగే ఉత్తర దిశవైపు దూసుకుపోతున్నాడు. అది చూసి ఇన్‌స్పెక్టర్ భార్గవ రామారావు విజిల్ గొట్టాడు. దానికి తోడుగా ఇంకా రెండు, మూడు విజిళ్లు కురుక్షేత్రంలో శంఖానాదాల మాదిరి మ్రోగాయి. కొంచెం దూరంగా ఒక పోలీసు రోడ్డు మధ్యలోకి దూకుతూ పరిగెత్తుతూ వెళ్లి ఒలంపిక్స్‌లో భారతదేశానికి మొదట

వ్యక్తిగత బంగారు పతకం సంపాదించినంత గర్వంతో పాపం ఆ మోపెడ్ వాడిని పట్టుకొని ఇన్‌స్పెక్టర్ ముందు హాజరు పెట్టాడు. అతన్ని పట్టుకొని తీసుకొచ్చేటప్పుడు అంటే దాదాపు మూడువందల అడుగులు నడిచేలోపల, ఏడుస్తూ, గగ్గోలు పెడుతున్న ఆ మోపెడ్ వాడి తలవెనక, వీపుమీద ఆ పోలీసువాడు కనీసం ముప్పైసార్లు ఘన తాళం వేసి వుంటాడు. రాగానే, ఆ ముద్దాయి ఇన్‌స్పెక్టర్ గారి ముందు సాష్టాంగ ప్రణామం చేసి ఆయన పాదుకలను పట్టుకొని భోరున ఏడ్వడం మొదలు పెట్టాడు. రెండు నిముషాలు లోపల, ఆ ఒలంపిక్స్ వాడు, అతన్ని పట్టి పైకి తీశాడు. అంతేకాదు, మళ్లీ, ఆ పాదుకలపై పడకుండా, అతని చేతిని కొండచిలువలా చుట్టుకున్నాడు. ఏమైనా అడిగేముందు, నడుస్తూ, తన ఆవేదనలు వ్యక్తపరిచే ఆ ద్విచక్ర శకట చోదకుడి తప్పేమిటి? ఆ తప్పు అతను ఎందుకు చేశాడు?

కామారెడ్డి వాస్తవ్యుడయిన వెంకటరమణ తండ్రి గతించి ఇప్పటికి నాలుగైదు సంవత్సరాలు అయింది. ఎనిమిదవ తరగతి వఱకే చదువుకున్న ఆ అబ్బాయి, ఏవేవో మాలీ పనులు చేసి, రోగ గ్రస్తురాలయిన తల్లిని, పన్నెండు సంవత్సరాల చెల్లిని, తన శక్తి కొలది పోషించేవాడు. అలా వుండగా, హైదరాబాదు నాచారంలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఒక మిత్రుడి శ్రమఫలితంగా వెంకటరమణకు కూడా అక్కడే ఉద్యోగం దొరికింది. నెలకొకసారి మాత్రం అతను కామారెడ్డికి వెళ్ళి, తల్లిని, చెల్లాయిని చూచి వచ్చేవాడు.

ఈరోజు సాయంత్రం ఐదుంబావుకు, కామారెడ్డి నుంచి ఆ ఫ్యాక్టరీకి ఒక టెలిఫోన్ సందేశం వచ్చింది - వెంకటరమణ తల్లి మధ్యాహ్నం మూడున్నర గంటలకు మరణించిందని. ఫోన్‌లో మాట్లాడేటప్పుడే ఏడ్వటం మొదలు పెట్టిన వెంకటరమణ, ఒక స్నేహితుడి మోపెడ్ తీసుకొని వేగంగా కామారెడ్డికి వెళుతున్నాడు. అతని మనసులో అంతా, తల్లి శవం దగ్గరకూర్చుని, నిస్సహాయంగా ఏడుస్తున్న చెల్లాయి రూపమే వుంది. వెంకటరమణకు ఒక పాత మోపెడ్ వుండేది. కాని, అది వర్క్‌షాప్‌లో వుండడంవల్ల, అతనితో పనిచేస్తున్న ఇంకొకరి మోపెడ్ తీసుకొని బయలుదేరవలసి వచ్చింది. ఆ కారణంగా అతని దగ్గర డ్రైవింగ్ లైసెన్స్ వున్నాగూడా, ఆ మోపెడ్ 'సి' బుక్ లేదు. తల్లి చచ్చి అక్కడ పడివుంటే అక్కడకు త్వరగా చేరేందుకు ప్రయత్నం చేయాలా లేక 'సి' బుక్ కొఱకు వెదకాలా?

అతని ఏడుపు విన్న భార్గవ రామారావుకు సానుభూతి కలగనే లేదు. అతనిలాగ ఎంతో మందిని చూసిన అధికారిగదా. ఆ మోపెడ్‌ని ఎక్కడ నుంచో దొంగిలించి, సిటీకి దూరంగా తీసుకెళ్లడానికి ఇతను ప్రయత్నం చేస్తున్నాడేమోనని ఇన్‌స్పెక్టర్ అనుమానం. అలా కాదని చెప్పి అతను వెక్కి వెక్కి ఏడ్చాడు. తన ఫ్యాక్టరీ నెంబరుకు టెలిఫోన్ చేసి అడిగి చూడమని ఆ నియమపాలకుణ్ణి అతను అభ్యర్థించాడు. కాని ఏం లాభం? తను రెండు రోజుల్లో ఆ వాహనంతో సహా పోలీస్ స్టేషన్లో హాజరు

అవుతానని, అతను ఏడుస్తూ చెప్పాడు. ''వీల్లేదు. మోపెడ్ ని, దొంగని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళు'' అని ఇన్‌స్పెక్టర్ ఆజ్ఞ. వెంకటరమణ పెద్దగా ఏడ్చాడు. జనం గుమికూడారు. వాహనాన్ని వదలమన్నా ఫరవాలేదు. కాని, కామారెడ్డిలో చచ్చిపడి వున్న, తన తల్లిని చూడడానికి తనను వదలమని, గుండె చీలినట్లు అతను బిగ్గరగా ఏడ్చి మొరపెట్టుకున్నాడు. స్టేషన్‌కు తీసుకెళ్ళమని ఇన్‌స్పెక్టరు ఇచ్చిన ఆజ్ఞను, ఆ కానిస్టేబుల్ నెరవేర్చడానికి సన్నద్ధుడయినాడు. ఆ నిముషంలో,

కానిస్టేబుల్ పట్టు వదిలించుకొని వెంకటరమణ రోడ్డు అవతలి వైపుకు పారిపోయాడు. జనాన్ని తోసుకొని, కానిస్టేబుల్ అతని వెంట పరిగెత్తాడు. అతను ఎక్కువ దూరం పారిపోలేదు. ఏర్‌పోర్ట్ గోడ దగ్గరకు వెళ్ళి, ఒక పిచ్చివాడిలాగ ఏదో అరుచుకుంటూ తలను మూడుసార్లు గోడకు కొట్టుకున్నాడు. కానిస్టేబుల్ అతని దగ్గరకు చేరేసరికి, తలనుంచి రక్తం కారుతూ ఆ అబ్బాయి స్పృహ తప్పి పడివున్నాడు. అక్కడ గుమికూడిన జనమందరికీ, ఆ ఇన్‌స్పెక్టరును, ఇతర సిబ్బందిని, కొట్టి చంపేయాలన్నంత కోపం వచ్చింది.

వెంకటరమణను గాంధీ ఆసుపత్రిలోని అత్యవసర చికిత్స విభాగంలో చేర్పించారు. అతనిపై మోటారు వాహన చౌర్యాన్ని, ఆత్మహత్యా ప్రయత్న నేరాన్ని మోపుతూ ఒక కేసు రిజిస్టరు చేయబడింది. కాని, ఆ కేసులో పోలీసులకు మున్ముందు చేయాల్సిన కార్యక్రమాల అవసరం లేదు. ఆ అబోధావస్థనుంచి బయటకు రాకుండానే తెల్లవారు ఝామున అతడు ఎంతో ప్రియమైన అమ్మ దగ్గరకు చేరుకున్నాడు.

వెంకటరమణ ఫ్యాక్టరీ నుంచి జనం ఆసుపత్రికి వచ్చిన తరవాత పోలీసుకు అసలు వివరాలు తెలిశాయి. తొందరగా 'పోస్టుమార్టమ్' జరిపించి, అతని నిర్జీవ శరీరాన్ని, అతని మిత్రులు కామారెడ్డికి తీసుకుపోయారు. తల్లి, తనయులు భౌతిక కాయాలు ఒకే సమయంలో కాలి బూడిదైపోయాయి.

అంతలో, ఇన్‌స్పెక్టర్ భార్గవ రామారావుకు వ్యతిరేకంగా, కార్మిక సంఘాలు, పత్రికల వాళ్ళు, ప్రజల్లో కొన్ని సంఘాలు సమ్మెలు మొదలుపెట్టారు.

భార్గవ రామారావును మళ్ళీ సస్పెన్షన్‌లో పెట్టారు. తను ఎలాంటి తప్పు చేయలేదని, తన డ్యూటి మాత్రమే చేశాననీ, తనను అన్యాయంగా సస్పెండు చేశారని, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో కేసు వేశాడు. అతన్ని వెంటనే ఉద్యోగంలో తిరిగి తీసుకోవాలని, ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది.

తిరిగి డ్యూటీకి హాజరయిన అతను కమీషనర్‌కు ఒక వినతి పత్రము సమర్పించాడు. అతనికింకా మిగిలివున్నది మూడు సంవత్సరాల సర్వీసు మాత్రమేనని, ఆ కాలంలో దయచేసి లా అండ్ ఆర్డర్‌లోగాని, ట్రాఫిక్‌లోగాని, నేరపరిశోధనా విభాగంలోగాని పోస్టు చేయకుండా, స్పెషల్ బ్రాంచిలో వుంచమని.

అతని అభ్యర్ధనను కమీషనరు స్వీకరించాడు.